

గరళకంఠుడు

— శర్వరి

స్వామీజీ పేరు చాలా కాలంగా పత్రికలలో చదవటం, శ్రీవారి లీలలు వినడమే కాని, వారిని చూచింది లేదు. నాకు చిన్నప్పటినుండీ స్వాములన్నా, బాబాలన్నా వల్లమాలిన యిష్టం. నేనూ ఒకనాటికి సన్యసించి తీరతానని నేను పుట్టకముందే మా తాతయ్య జోస్యం చెప్పాడట. అందుకేనేమో నాది పుట్టినప్పటినుండి సన్యాసి బ్రతుకైంది.

స్వామి శివప్రసాద్ పేరు మన దేశంలోనే కాదు, విదేశాలలోనూ మ్రోగిపోతున్నది. ఆయన వయస్సు 35 అయినా, 2500 సంవత్సరాలు హిమాలయాల్లో తపస్సు చేశారని భక్తులు చెబుతుంటారు. ఆయన నిత్య యవ్వనుడు. తెల్ల గడ్డంలేని స్వాముల్ని జ్ఞానులుగా మన మనస్సు అంగీకరించదు. కాషాయ

బట్టలు, కమండలం అందరూ ఆమో దించే మేకప్, స్వాములకు.

స్వామి శివప్రసాద్‌కు సినిమా హీరోలకున్న గ్లామర్ వుంది. కారణం ఆయన సహజ అందగాడు. ఆధ్యాత్మికంగా ఆయన ఎంతటి గొప్పవాడో, చాలామందికి తెలియనట్లే నాకూ తెలియదు తెలుసుకుందామనే ఆయన పాద సేవ ప్రారంభించాను. ఆయన కళ్ళు మూసుకుని శూన్యంలోంచి విభూతి, విగ్రహాలు, స్మగల్డ్ గడియారాలు, బంగారం గొలుసులు, నోట్ల కట్టలు సృష్టించి భక్తులకుబహూకరిస్తుంటే నాకు మతిపోయినట్లయ్యేది.

స్వామీజీ మా వూరు వచ్చినప్పటి నుండి శుశ్రూష ప్రారంభించాను. జనం వేల సంఖ్యలో ఆయన దర్శనానికి రాసాగారు. నగరంలో డబ్బుగలవారెందరో వచ్చేవారు. పేదవారికి ఓ పట్టాన శ్రీవారి దర్శనభాగ్యం లభించేది కాదు. ఒక్కసారి ఆయన్ని దర్శిస్తే ఆయన పాదధూళి స్వీకరిస్తే ఈ జన్మంలోచేసిన పాపాలన్నీ పటాపంచలై పోతాయి.

ఆ రోజు మామూలుగా భక్తులు రాసాగారు. ఒకామె వచ్చి ఆయన పాదాలకు నమస్కరించగానే స్వామీజీ షాక్ కొట్టినట్లు ఉలిక్కిపడ్డారు. పాదాలు వెనక్కి లాక్కొని ఆవైపు తీక్షణంగా చూచారు క్షణంలో ఆయన కళ్ళు అగ్నిగోళాలైనాయి. ఆమె ఆయన పాదాలు పట్టి వదలలేదు. కన్నీటితో అభిషేకం చేస్తూ "నన్ను క్షమించరూ" అని వేడుకుంది

"సుజాతా" అన్నారు స్వామి దగ్గుత్తికతో. ఆమె లేచి విసవిస పరుగు తీసింది ఆయన పిలుస్తున్నా వినిపించుకోకుండా, వెనుతిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

స్వామీజీ మొహం వివర్ణమైంది. మిగతా భక్తులు ఎవ్వరికీ దర్శనం యివ్వమని పంపించివేశారు.

కొన్ని క్షణాల తర్వాత నేనే ధైర్యం చేసి, "ఎవరు స్వామీ ఆమె? అని ప్రశ్నించాను.

ఆయన బవిరిగడ్డాన్ని సవరించుకుంటూ చిద్విలాసంగా నవ్వారు.

"ఈ లోకం చాలా విచిత్రమైంది నాయనా! ఎప్పుడు ఏ సంఘటన, ఏ విపరీతానికి దారితీస్తుందో చెప్పలేం. నేను సన్యాసి కాకముందు, మీలాగా సంసారినే. అప్పుడు నాకో మిత్రుడుండేవాడు మోహన్ అని. అతని ఇల్లాలు ఈ సుజాత. కర్మవశాత్తు మోహన్ జైల్లో పడ్డాడు ఆ రోజు జైలునుండి అతను విడుదలయ్యే రోజు."

స్వామీజీ చెప్పడం సాగించారు...

"పెరిగిన గడ్డం చీదరగా వుంది. అవును కదూ! అది మనిషి నిరాశకు చిహ్నం. మోహన్ అడుగులో అడుగు వేసుకుంటూ బయటపడ్డాడు. గేటువద్ద

ఇద్దరు సెంట్రీలు తుపాకులతో వీడ్కోలు చెప్పారు. ఇంతకాలం తనకు ఆశ్రయం యిచ్చిన జైలును వెనుతిరిగి చూచాడు. ఎత్తైనగోడలు ఇనపగేటు,దానిలో చిన్న ద్వారం... కొన్ని క్షణాలు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. జీవితంలో ఓ దుర్భర మైన అధ్యాయం ముగిసింది... విధి మనిషిపట్ల ఎంత క్రూరంగా ప్రవర్తి స్తుంది అనుకున్నాడు.

మోహన్ కళ్లు వర్షిస్తున్నాయి. అవి ఆనందబాష్పాలు. ఇంతకాలం జైలు జీవితం గడిపి, ఇప్పుడు విడుదల అయి నందుకు తనకు కలిగింది ఆనందమా! సెంట్రీల నవ్వులు అతన్ని ఈ లోకం లోకి తెచ్చాయి

"ఎరోయ్, జైలొదిలి ఎళ్లబుద్ధి కావడంలేదేటి! ఏడుస్తున్నావ్?" అని పరిహాసం చేశాడు ఒకడు

"ఒరే అబ్బాయ్ అంతబెంగపడకు. మనసుంటే మార్గమేలేదా! మళ్ళీ రావా లనుకుంటే ఎవడ్నో చావకొట్టేయ్ సరా సరి తిరుగుటపాలో వచ్చేస్తావ్!" రెండవ సెంట్రీ వాఖ్య.

ఆ సెంట్రీల నవ్వులు,వ్యాఖ్యానాలు, చెవుల్లో గింగురుమన్నాయి. వినలేక చెవులు మూసుకున్నాడు. తను జైలు జీవితంకోసం మొహంవాచిపోయాడా! ఏమిటీ లోకం! అనుకుంటూ ముందుకు సాగాడు ఈ లోకంలోకి, వెలుగులోకి, సభ్యప్రపంచంలోకి నడిచాడు. ఊరు జ్ఞాపకం రాగానే, కళ్ళు మెరిశాయి. గుండె ఆశలతో నిండింది. అనురాగంతో పులకరించింది. కోటి కోర్కెలతో స్వంత ఊరు బయలుదేరాడు.

నడిచి నడిచి, వేసారి, గంపెడాశతో కొండంత కోర్కెతో ఊరు చేరు కున్నాడు. అల్లంత దూరంలో ఆ కని పించేదే తన ఇల్లు. అందులో ఉంటుంది తన ఇల్లాలు. తనను చూడగానే ఎంత సంబరపడిపోతుందో! అసలు తనను గుర్తిస్తుందో లేదో! మూడేండ్లలో ఎంత మారిపోయిందో! తను గుర్తించగలడా అసలు! ఆనందం పట్టలేక, తనను కావిలించుకుని, భోరున విలపిస్తుంది. తను ఊరడించి ఇంక జీవితాంతం నిన్ను వదలిఉండనని ప్రమాణం చెయ్యాలి. అప్పుడు తన కౌగిలిలో కరిగిపోతుంది. ఓహ్... స్వర్గం...

ఆ స్వర్గం, సుఖాలు ఊహించుకో గానే అతని కళ్ళలోకి వెలుగు వచ్చింది. గుండె గుబగుబ లాడింది. మూడేండ్ల క్రితం సుజాత ఏడ్చింది. ఆ కన్నీరు తనకింకా జ్ఞాపకమే. ఎంతగా కుమిలి పోయింది. ఆమె కన్నీరు తుడిచే శక్తి ఆనాడు తనకు లేకపోయింది.

నాటికి, నేటికి ఊరెంతగా మారి పోయింది. అక్కడక్కడ కొత్త మిద్దెలు, భవనాలు లేచాయి. దేశంసుభిక్షంగావుంది. పొలాలు పచ్చగా వున్నాయి. పంటలు బాగా పండుతున్నట్లుంది. మనుషులు

కూడా సంతోషంగా వున్నారు. తను జైల్లో ఉన్న మూడేళ్ళలో దేశ వ్యవస్థే మారిపోయింది. ఊరు రూపు రేఖలే మారాయి. ఎక్కడా కరువు కాటకాలు కనిపించడం లేదు. అప్పుడు ఎండి బీట వారిన పొలాలే, ఇప్పుడు పచ్చగా ఉన్నాయి. కడుపు నిండా తినడానికి తిండి దొరుకుతున్నది. చేసుకోడానికి పని దొరుకుతున్నది. అదే మూడేళ్ళ క్రితం పట్టెడు మెతుకులకోసం ఎంత పోరాటం గుప్పెడు గింజలకోసం ఎంత తపన.

అప్పుడు కరువు విలయతాండవం చేసింది. వర్షం చినుకులేక నేల బీటలు వారిపోయింది. నూతుల్లో తాగడానికి నీళ్ళు లేవు. చచ్చేమనిషిలో సైతం చావని ఆశ. మనిషిని చావనీయని ఆశ. ఒక ప్రక్క జనం మందులమూడి చస్తున్నారు. మరో ప్రక్క పేదల ఆకలిని ఆసరా చేసుకుని కొందరు భాగ్యవంతులవుతున్నారు. తనకు జైలుకు వెళ్ళినందుకు విచారంలేదు. అదకత్తెరలో నలిగిపోలేకపోయాడు. తాను జైల్లోపడ్డా ఒక ప్రాణిని రక్షించగలిగాడు. అదే తృప్తి. ప్రేమకోసం తను ఎంత త్యాగం చేశాడు. కానీ తన త్యాగానికి చిహ్నంగా ఎవరూ తాజ్ మహల్ నిర్మించరు... ఎర్రని ఎండలో మూడేళ్ళ ముందరి జీవితాన్ని-మూడేళ్ళ కారాగారా జీవితాన్ని బేరీజు వేసుకుంటూ వచ్చాడు.

తన ఇల్లు... తన భార్య... ఎంత మధురమైన భావన. తలచుకుంటేనే ఉద్రేకం కలుగుతోంది...కానీ...కానీ.. ఇల్లు ఊహాతీతంగా, నిశ్శబ్దంగా వుంది. సుజాత తనకు ఎదురుగా వచ్చి స్వాగతం చెప్పలేదు. ఎంతటి నిస్తబ్దత. తను రాసిన ఉత్తరం అందలేదా? జైలులో ఉన్న మూడు సంవత్సరాలలో తను ఉత్తరమే రాయలేదని అలిగి ఉంటుంది. కోపం వచ్చి వుంటుంది. అలగడం ఆడవాళ్ళ జన్మహక్కు. ఏమిటో! తాను మొహం చెల్లక ఉత్తరం రాయలేదు గానీ, ప్రేమ లేక కాదుగా! ఆ విషయం సుజాతకు తెలియదా! ఆమెకోసంగదా, తను అన్ని పాట్లు పడ్డది. చివరకు ఆమె ప్రేమ కోసమేగదా జైలుకు వెళ్ళింది.

జైలుకు వెళ్ళిన కొత్తలో సుజాత రెండురోజుల కొకసారి ఉత్తరం రాసేది. ఆ ఉత్తరాల్లో ఎంత బాధ వ్యక్తం చేసేది! తను ఒక్కదానికీ సమాధానం రాయలేదు మొహంచెల్లక.

ఇంటి ఆవరణలో అడుగు పెట్టగానే ఏదో అపశృతి—శంకించింది మనస్సు. ఆ ప్రేమమయి కోసం వేయికళ్ళతో ఎదురు చూసాడు. కోటి కోరికలతో ఎదురు చూసాడు. స్మశాన నిశ్శబ్దం అక్కడ.

ముందర గదిలో ఎవరూ లేరు. కానీ గదినిండా బూజు గలీజుగా, పాడుబడ్డ

కొంపలావుంది. తాను ప్రాణప్రదంగా అలంకరించిన ఫోటోలు లేవు. తనదీ సుజాతదీ పెళ్ళిఫొటో లేదు. తనవైన ఏ వస్తువులూ కనిపించకపోయేసరికి గుండె గుభిల్లుమంది. వెన్నులో శూలం దిగ బొడిచినట్లయింది. ఇది తన ఇల్లు కాదా! పొరపాటున ఏ పాడుపడ్డ కొంపలోనో ప్రవేశించలేదు గదా !

మోహన్ వస్తుతః పిరికివాడు కాదు కానీ ఆ క్షణంలో భయంతో వణికి పోయాడు. లోపలి గదిలోంచి వెకిలి నవ్వులు వినిపించాయి. భయంగా అనుమానంగా లోపలిగదిలోకి చూచాడు. కాళ్ళకు మద్యం సీసాలు తగిలాయి. ఆ ధ్వనికి లోపలున్నవాళ్ళు ఇటు తిరిగి చూచారు. అది తాగుబోతులకు నిలయమైంది. వాళ్ళను చూచి తనెంతగా భయపడ్డాడో, తనను చూసి వాళ్ళు అంతగానే భయపడి పరుగు లంకించుకు న్నారు. దొడ్డిగుమ్మాన వెళ్ళి, గోడ దూకి వుడాయించారు తన యిల్లు నిర్మానుష్యం అయింది. తన ఇల్లు వల్లకాడైంది. పిచ్చి ఆవేశంతో వెనుతిరిగి వస్తుండగా తను సుజాత పేర రాసిన కవరు కాళ్ళకు తగిలి వెక్కిరించింది. అయితే సుజాత ఏమైనట్లు ? చచ్చిపోయిందా !

పిచ్చిగా, భారంగా రోజంతా తిరిగాడు. మారిపోయిన ఊరు మహా స్మశానంలా కనిపించింది. తన కళ్ళకు తను సుజాతతో కలిసి గడిపిన రోజులు, అనుభవాలు ఒక్కొక్కటే బాధించ సాగాయి. అప్పుడు ఎంత అనుభ వించాడో ఇప్పుడు అంత విలపిస్తున్నాడు. కొన్ని నిముషాల క్రితంవరకు తనలో ఎన్ని కోర్కెలు, తన వెన్ని బంగారు కలలు. ఇప్పుడు వాస్తవం కటికచేదుగా, విషతుల్యంగా మారింది. సుజాత స్థానే శూన్యం మిగిలింది. ఆనందం స్థానే మహా శూన్యం మిగిలింది.

"నా భార్య ! నా సుజాత ఏది? ఏమైంది ఆమెకు ? ఎవరిని అడగాలి ? ఎదురైన ప్రతి వ్యక్తి తను అడిగేలోగా పారిపోతున్నాడు. తనను చూచి భయపడి ఇళ్ళలో దూరి తలుపులు బిగించు

కుంటున్నారు. తనను పిచ్చివాణ్ణి చూచినట్లు చూస్తున్నారు.

కాళ్ళీడ్చుకుంటూ కాలువగట్టుకు వచ్చాడు. నీలాటిరేవులో ఒక అమ్మాయి కనిపించింది. నీళ్ళబిందె చంకన పెట్టుకుని వయ్యారంగా వస్తోంది. ఆమెను అడిగితే సుజాత జాడ తెలియవచ్చునేమో ? తనను చూచి భయపడి పారిపోకపోతే సుమా!

ఆ అమ్మాయి గిరిజ. తను గుర్తించ గలిగాడు. అబ్బ ఎంత ఎదిగింది మూడేళ్ళలో. ఈడొచ్చిన ఆడపిల్ల బుస్సున పొంగుతుంది.

"గిరిజా !" భయంగానే పిలిచాడు, దగ్గరగా వెళ్ళి.

ఆమె నమ్మలేనట్లు చూసి, నొసలు చిట్లించింది.

"నువ్వా" అని ప్రశ్నించబోయింది.

"నేను గిరిజా ... మోహన్‌ని ... గుర్తుపట్టలేవా?"

"అయితే, మోహన్, నువ్వు నువ్వేనా ?" ఇంకా ఆ అమ్మాయికి అనుమానం తీరలేదు.

"అవును పాపా, నేనే ! నువ్వు చాలా ఎదిగావు గుర్తించలేకపోయాను సుమా!"

"అయితే నువ్వు చచ్చిపోలేదా మోహన్ ! బ్రతికే వున్నావా ?''

"నేను చచ్చిపోయానని ఎవరు చెప్పారమ్మా ?"

"నిన్ను జైల్లో ఉరిశిక్ష వేశారని చెప్పుకున్నారే మరి !''

"ఎవరు చెప్పుకున్నారు ?"

''సుజాత చెప్పింది."

గిరిజ అబద్ధం చెప్పదు చదువుకున్న పిల్ల. కలవారి బిడ్డ

"లేదమ్మా ! నా సుజాత అంత అభాండం వేసిందంటే నమ్మలేకుండా వున్నాను......నా భార్యకు నేనంటే ప్రేమ కదూ, అందుకని నేను జైల్లో పడ్డాక అలా అబద్ధం చెప్పివుంటుంది." కళ్ళల్లో నీరు ఉబుకుతుండగా, డగ్గుత్తికతో అన్నాడు.

"పోనీ నా సుజాత ఏమైందో చెప్పు పాపా ! ఎక్కడుంది?" గిరిజ నెమ్మదిగా ఓ రాయిమీద కూర్చుంది.

"కూర్చో మోహన్ ! అసలు జరిగిందేమిటో నాకు చెప్పవూ ? నిన్ను గురించి ఎందుకిన్ని అబద్ధాలు చెప్పారు ?" అడిగింది.

"ఇంకా నా కథ ఎందుకులే పాపా?"

"చెప్పాలి ! చెబితేనే సుజాత ఎక్కడుందో చెబుతా."

మోహన్‌కు చెప్పక తప్పలేదు.

"మూడేళ్ళ క్రితం పాపా ! నువ్వప్పుడు పట్నంలో చదువుకుంటు న్నావు అప్పుడో పెద్ద కరువొచ్చింది. ఇక్కడ తినడానికి తిండిలేక, త్రాగ డానికి నీళ్ళులేక జనం చచ్చిపోయారు. ఇప్పుడీ పొలాలు- కాలువ చూస్తే అప్పు

దంత కరువొచ్చిందంటే ఎవరూ నమ్మరు. ఎందరో చచ్చిపోయారు. కొందరు వలసపోయారు. జంతువుల్ని చంపి పచ్చిమాంసం తిన్నారంటే నమ్మ్కం. మట్టి తిని ఆకలి తీర్చుకున్నారు."

గిరిజ వణికిపోయింది. మోహన్ చెప్పసాగాడు.

"మేము ఎన్నోరోజులు పస్తులున్నాం దాచుకున్న గింజలన్నీ దొంగలు దోచుకుపోయారు. రోజురోజుకీ కరవు అధికమైంది. కూలిచేద్దామన్నా పని దొరకలేదు రూపాయి డబ్బులు దొరికేవి కావు ప్రభుత్వం ఎంతో సహాయం చేసింది పేదలకు గంజి కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదీ అందినవారికి అందేది పెద్దల అనుగ్రహం.

నేనెంత ఏడ్చేవాణ్ణో నీకు తెలియదు పాపా! కన్నీరు ఆకలి బాధను తీర్చలేరని తెలుసుకున్నాను. ఎలాగో డబ్బు సంపాదించాలి. నా సుజాతను బ్రతికించుకోవాలి! అదే నా లక్ష్యం. అదే నా ధ్యేయం.

నా ప్రాణానికి ప్రాణంగా, నా జీవన జ్యోతిగా ప్రేమించిన సుజాత ఆకలితో చచ్చిపోతుంటే చూడలేకపోయాను. గంజినీళ్ళు కూడా దొరకని పరిస్థితుల్లో గుండెను రాయి చేసుకున్నాను. పట్నం బయలుదేరాను. చేతికి అందిన వస్తువు నల్లా దొంగిలించి పట్నంలోనే అమ్మివేసి డబ్బు సంపాదించాను. ఆ క్షణంలో దొంగతనం పాపమని అనిపించలేదు. నిజాయితీగా బ్రతికే అవకాశం లేక, ఆకలిబాధ తట్టుకోలేక దొంగనైనాను. రెండురోజులు ఎంతగా కుమిలిపోయానో మాటల్లో చెప్పలేను పాపా! ఎవరికీ మొహం చూపించలేకపోయాను. వెలుగును చూడలేకపోయాను. నేను ప్రేమించిన సుజాతకోసం, నా భార్యకోసం, దొంగనై, ఆమెకే నా మొహం చూపించలేకపోయాను క్రుంగిపోయాను. సిగ్గు, భయం నన్ను క్రుంగదీసింది.

చివరికి తెగించి సుజాతతో చెప్పాను, నేను చేసిన నీచపు పనిగురించి. ఆమె ఏడ్చింది. నేను అంతగా దిగజారిపోతానని ఆమె అనుకొని ఉండదు

"తిండికిలేకపోతే చద్దాం దొంగతనం మాత్రం చేయకండి. ఆ పాపపు కూడు నేను తినలేను...ఆ పాపం నేను చూడలేను" అని ఏడ్చింది.

"ఏది పాపం! బ్రతకడమే ఒక పాపం అయినప్పుడు, ఏ పాపం చేస్తేనేం!"

మూడు నెలలు గడిచాయి. తన మాంగల్యం పై ప్రమాణం చేయించుకుంది నా చేత. 'నేను దొంగతనం చేయనని.' అలా చేస్తే తనకూ నాకూ ఋణం తీరినట్లే అన్నది.

ఓ రోజు పట్నం వెళ్ళాను ఉద్యోగం కోసం ఉద్యోగం కాదుకదా, కనీసం

కూలిపని కూడా దొరకలేదు. కరువు మరీ విజృంభించింది. ఇంటికి తిరిగి వచ్చాను. చనిపోయిన వాళ్ళని పూడ్చ డానికి ఊరిపెద్దలు, పొలిమేరల్లో గోతులు త్రవ్వి పెట్టారు ఓ రాత్రిపూట వెళ్ళి ఆ గోతుల్లో పడుకుని మట్టి కప్పు కుంటే ఈ బాధలుండవు అనిపించింది. సుజాతకిచ్చిన మాట నిలబెట్టుకోవడం నా వల్లకాదు. పాపం చేయాలి. రేపు నరకానికి వెళ్ళినా సరే! ఏది పాపం, ఏది పుణ్యం! రెండింటికి కర్త భగవంతుడే రెండు పనులూ మనచేత చేయిస్తున్నది ఆ భగవంతుడే మనం నిమిత్త మాత్రులం అనిపించింది. భారం భగవంతునిపై వేసి బయలుదేరాను. పట్నం చేరాను. చీకటిపడేవరకు అక్కడక్కడ తచ్చాడాను.

అలసిపోయి ఓ దేవాలయ ప్రాంగణంలో చేరి ఇన్ని నీళ్ళు త్రాగి సొమ్మసిల్లిపోయాను. ఎంతసేపు నిద్రపోయానో తెలియదు కళ్ళు విప్పే సరికి చుట్టూ పండువెన్నెల. నాలో కరకరలాడే ఆకలి. ఎదురుగా దేవాలయం గర్భగుడిలో దేవుడి ఉనికిని చెప్పే ప్రమిద దీపం. గుళ్ళో ప్రవేశించాను. కొన్ని నిమిషాలు దైవాన్ని ప్రార్థించాను. ఈ బ్రతుకునుంచి విముక్తి కలిగించమని కష్టాలలో దేవుడు గుర్తుకు వస్తాడంటారు. అసలు కష్టాలు వచ్చినప్పుడే దేవునిపై నమ్మకం పోతుంది. విగ్రహంముందు తన్మయత్వంతో గడిపాను.

నా ప్రార్థన భగవంతుడు విన్నాడా? పేదవాడి ఆకలి అరుపులు, విన్నపాలు దేవుడనేవాడు వింటే, ఇంత కరువు, ఇన్ని ఇక్కట్లు వుండవు ... దరిద్రు డంటే దేవుడికీ అసహ్యమే.

"భగవాన్ నన్ను క్షమించు. ఇప్పటికే నన్ను దొంగగా అబద్ధాలకోరుగా, దుర్మార్గుడుగా నీవు ఖర్చురాసి వుంటావని తెలుసు. ఏం చేస్తాను చెప్పు. నా కర్మ, నా పూర్వజన్మ దుష్కృతం. నేను కలవారి ఇంట అద్దాల బిడ్డగా పుట్టివుంటే ఈ పని ఎందుకు చేస్తాను చెప్పు! ఈ తప్పు దరిద్రుడుగా పుట్టించిన నీదికాని, నాది కాదయ్యా! నే నొకడినే అయితే చచ్చిపోయేవాణ్ణి. ఆత్మహత్య చేసుకుని వుండేవాణ్ణి. కాని నన్ను నమ్ముకున్న నా ఇల్లాలు, సుజాత, ఆమెను పోషించవలసిన బాధ్యత నాది కదా! నువ్వే చెప్పు భగవాన్! నేను దొంగతనం చేసేది ధనాశతో కాదు. ఒకరిని దోచుకోడానికి కాదు. ఈ కడుపు కోసం. ఆకలి తీరడంకోసం! ఓ ఆడ కూతురును చేజేతులా చంపలేకనయ్యా. హత్యకన్న దొంగతనం మేలుకదా!

నా ప్రార్థన భగవంతుడు విన్నాడు! ఎదురుగా దీపం వెలుగులో వెండి పళ్ళాలు ధగధగలాడాయి. పళ్ళాల నిండుగా పళ్ళు, ఫలహారాలు. ఎవరో ధర్మాత్ములు పూజలుచేసి వెళ్ళారు. ఈ వెండి పళ్ళాలు అమ్మివేస్తే రెండు నెలలు గడుస్తుంది ఈలోగా వర్షాలుపడవచ్చు. రోజులు మారవచ్చు

భగవంతునికి వెండిపళ్ళాలు లేక పోతేనేం. అవి ఇరువురు జీవాల్ని నిలపడం మేలుగదా! భగవంతుడు సంతోషిస్తాడు. నేను దొంగను కాను. అనుకుంటూ ఆ వెండిపళ్ళాలు తీసి జేబులో దాచాను వెనుదిరిగి, ద్వారం దాటి, మండపం వద్దకు వచ్చానో లేదో జనం చుట్టుముట్టారు. నాకు ముచ్చెమట్లు పోశాయి నిర్దోషిలా తలవంచుకున్నాను. కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. కొద్ది నిమిషాలలో పోలీసులు వచ్చి నన్ను అరెస్టు చేశారు. మూడేళ్ళు శిక్ష పడింది.

"నువ్వే చెప్పమ్మా, పాపా! నేను దొంగనా! ఇతర్తా ఎన్ని దొంగతనాలు చేసినా భగవంతుడు తనకు పట్టనట్లు ఊరుకున్నాడు చూచావా! తన విషయం వచ్చేసరికి నన్ను క్షమించలేక పోయాడమ్మా!

గిరిజకు దుఃఖం ఆగిందికాదు.

"మోహన్ నువ్వు దొంగవు కావు మంచివాడివి. కానీ..."

"చెప్పు పాపా ఇప్పుడు చెప్పు. సుజాత ఏమైంది?" మోహన్ అడిగాడు.

"సుజాత మళ్ళీ పెళ్ళిచేసుకుంది మోహన్"

మోహన్ నెత్తిన పిడుగుపడ్డట్లయింది. అది నమ్మశక్యం కాని విషయం. అంతగా ప్రేమించిన సుజాత మళ్ళీపెళ్ళి చేసుకోవడమా! అదీతను బ్రతికుండగా.

"నమ్మలేను పాపా" అన్నాడు

"నువ్వు చచ్చిపోయ్యావని సుజాత చెప్పింది. ఊళ్ళో అందరూ అదే చెప్పుకున్నారు. ఎవరో ఓ పెద్ద లక్షాధికారిని పెళ్ళిచేసుకుని పట్నం వెళ్ళిపోయింది."

మోహన్ విలపించాడు.

"మా యింటికి వెడదాం రా మోహన్." పిలిచింది.

"వద్దమ్మా! ఈ పాపిమొహం ఎవరికీ చూపించలేను. నేను పాపిని, శాపగ్రస్తుణ్ని. నన్ను భగవంతుడు క్షమించలేదు. ... మీ రెవరూ జాలిపడి నన్ను మన్నించనవసరం లేదమ్మా!" అంటూ మోహన్ వెళ్ళిపోయాడు.

అది నిజం! ఒకసారి దొంగతనం చేసి జైల్లో పడ్డవాణ్ని లోకం క్షమించదు. మళ్ళీ జైలుకు వెళ్ళాలంటే ఏదో నేరం చేయాలి అతనికి పాపం చేయటానికి యిష్టంలేదు.

ఆ మోహన్ భార్య ఈ సుజాత. ఇప్పుడు వచ్చినామె. ఆమెను చూడగానే ఆ విషయాలన్నీ జ్ఞాపకం వచ్చాయి. అని కళ్ళు వత్తుకున్నారు స్వామి.

నాకు నమ్మబుద్ధికాలేదు. స్నేహితుని కథ వల్ల కన్నీరు రావలసిన పనిలేదు. దయ చూపవచ్చు. సుజాతను చూడగానే అయన కళ్ళు నిప్పులు కురిపించ నవసరంలేదు నిజానికి.

"అయితే స్వామీ! సుజాత వచ్చి మళ్ళీ క్షమించమని అడిగితే" అన్నాను.

"ఆ మోహన్ చచ్చిపోయి ఈ స్వామీజీగా అవతరించాడని చెబుతాను" అన్నారు సీరియస్‌గా

———